## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సప్ ద్వారా పంపగలరు



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పామాన్యుడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా నూతనంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు · మండల · నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number :
9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 95 ఎడిటర్ :పెనుగొండ సతీష్ శుక్రవారం 21 నవంబర్ 2025 పేజీలు 8 వెల 5.00


### నేడు హైదరాబాద్‌కు
# రాష్ట్రపతి రాక
### - రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరు కుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి

2 లో




- 27 మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు

### బీహార్ సీఎంగా
# నితీశ్ ప్రమాణం



(ఆకాంక్ష న్యూస్)

పాట్నా, నవంబర్ 20 : బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ

2 లో



### తిరుమల చేరుకున్న
# రాష్ట్రపతి ముర్ము

(ఆకాంక్ష న్యూస్)

తిరుమల, నవంబర్ 20 : రెండ్రోజుల పర్యటన నిమిత్తం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల చేరుకున్నారు. శ్రీపద్మా వతి విశ్రాంతి గృహం వద్ద ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్.నాయుడు, బోర్డు

2 లో

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
# కేటీఆర్‌కు బిగ్ షాక్
### - ఫార్ములా-కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా-కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలువార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి

2 లో



### దేశవ్యాప్తంగా
# సన్నబియ్యం పంపిణీ
### - కేంద్రమంత్రికి సిఎం రేవంత్ సూచన
### - పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్ కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం

2 లో

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం
### - గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం
### - సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, నవంబర్ 20 : గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది.ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది.తనముందుకువచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం

2 లో

# లొంగిపోతే ప్రభుత్వ పక్షాన సాయం
### - నక్సల్స్ జనజీవన స్రవంతిలోకి రావాలి: డిజిపి

(ఆకాంక్ష న్యూస్)

రంపచోడవరం, నవంబర్ 20 : లొంగిపోయిన నక్సల్స్‌కు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం ఉంటుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. చాలామంది ఇప్పటికే లొంగిపోయారని, మిగతావారు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులు లేని రాష్ట్రంగా చేయడమే పోలీసుల లక్ష్యమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతుందని, ఆరు నెలలుగా రాష్ట్రంలో మావోయిస్టుల కోసం సంభవ్ ఆపరేషన్ పేరిట గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, అందులో భాగంగా

2 లో

### కెటిఆర్‌పై రాజకీయ
# కక్షసాధింపు
### - స్థానిక ఎన్నికల ముందు ప్రభుత్వం కుట్ర
### - మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు వేముల, వినోద్




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీని కట్టడి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినపుడు, ఎన్నికలు

2 లో

# సిగాచి మృతుల కుటుంబాలకు ధోకా...!
### - వారికి ఇస్తాన్న కోటి పరిహారం ఏమైంది
### - డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా కాలయాపన
### - తక్షణం ఆదుకోవాలంటూ సిఎంకు హరీష్ రావు లేఖ



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : సిగాచి బాధితులకు ఇస్తామన్న కోటి పరిహారం హామీ ఏమైందని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. నాలుగు నెలలు గడిచినా సిగాచి బాధితులకు పరిహారం అందకపోవడంతో.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇచ్చింది 26 లక్షలే.. ప్రభుత్వం బాకీ పడింది 74 లక్షలు.. ఇది ముఖ్యమంత్రి మాట తప్పడం కాదా? అని హరీశ్ రావు నిలదీశారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ డబ్బులను కూడా ప్రభుత్వం ఇప్పించే

2 లో

# కేటీఆర్‌పై అక్రమ కేసులు రేవంత్ లక్ష్యం
### - రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట
### - బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు.' మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష

2 లో

### కెటిఆర్, గోరటిలపై
# ఎన్నికల కేసు కొట్టివేత



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నలకు తెలంగాణ హైకోర్టులో ఊరట దొరికింది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో వారిద్దరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన కేసులో ఊరట లభించింది. 2023 ఎన్నికల సమయంలో తెలం గాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద ఇంటర్వ్యూలు చేశారని కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నపై

2 లో

# ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ
### - పోచారం, అరికెపూడిలతో ముగింపు
### - దానం, కడియంలకు మరోమారు నోటీసులు

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయిం పుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్

2 లో

# తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

## - తిరుచానూరులో పద్మవాతి అమ్మవారి దర్శనం

## - నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ముర్ము



(ఆకాంక్ష న్యూస్)

తిరుమల,నవంబర్ 20 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతోపాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

# 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

## - బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు

## - మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 20 : కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

మొదటి పేజీ తరువాయి

అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్‌రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు.

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

మొదటి పేజీ తరువాయి

చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశిరచింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# సిగాచి మృతుల కుటుంబాలకు ధోకా...!

మొదటి పేజీ తరువాయి

నష్టపరిహారంలో చూపించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గారు నిస్సిగ్గుగా బాధితులకు రూ. 40 నుండి 50 లక్షలు అందించాం అని ప్రకటించడం అత్యంత శోచనీయం అన్నారు.. చికిత్స ఖర్చులను పరిహారంలో కోత విధించడం అమానవీయం. ఆచూకీ దొరకని 8 మందికి డెత్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దుర్మార్గం. సిగాచి యాజమాన్యానికి అధికారులు ఏజెంట్లుగా మారారు. బాధితులను చీదరించుకోవడం దారుణం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.కేంద్రం ప్రకటించిన రూ. 2 లక్షలు ఇప్పించే సోయి రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? హైకోర్టు మొట్టికాయలు వేసినా యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయడం లేదు? తక్షణమే కోటి పరిహారం చెల్లించాలి.. లేదంటే బీఆర్ఎస్ పక్షాన ఉద్యమిస్తాం అని హరీశ్ రావు హెచ్చరించారు. పరిహారం కోసం బాధితుల చెప్పులు అరిగేలా తిరుగుతున్నా.. పాలకుల మనసు కరగడం లేదు. సిట్ వేయరు.. అరెస్టులు చేయరు.. నిస్సిగ్గుగా సిగాచి యాజమాన్యాన్ని కాపాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారికి న్యాయం చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని 'సిగాచి' పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి, నాలుగు నెలలు గడిచింది. 54 మంది కార్మికులను పొట్టనపెట్టుకున్న నాటి దుర్ఘటన ఇంకా కళ్లముందే కదలాడుతున్నది. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులు నడి రోడ్డున పడి కన్నీరు మున్నీరవుతున్నాయి. సిగాచి ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో మీరు, మీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ప్రమాదం జరిగిన జూన్ 30న మీరు స్వయంగా వచ్చి, మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని ఘనంగా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మీడియా సాక్షిగా హామీ ఇచ్చారు. కానీ నిజానికి ఏం జరిగింది? పరిహారాన్ని పరిహాసంగా మార్చారు. నాలుగు నెలలు గడిచినా పరిహారం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. డెత్ సర్టిఫికెట్ లేక ఆ కుటుంబాలకు బీమా డబ్బులు రాక, పరిహారం అందక నరకం అనుభవిస్తున్నారు. నిబంధనల పేరు చెప్పి, ఆచూకి దొరకని వారిని మృతులుగా పరిగణించడానికి 7 ఏళ్లు వేచి చూడమనడం మానవత్వం అనిపించుకుంటుందా? అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రకటించిన రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా ఇప్పటికీ బాధితులకు అందలేదు. కేంద్రంతో మాట్లాడి ఆ డబ్బులు ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

# కెటిఆర్, గోరటిలపై ఎన్నికల కేసు కొట్టివేత

మొదటి పేజీ తరువాయి

సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోడ్ ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారనీ పోలీసులు కేసు పెట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. ప్రభుత్వ పథకాలపై గోరెటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని విచారణ సందర్భంగా పోలీసుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ది చేకూర్చే విధంగా ఆ ఇంటర్వ్యూ ఉందని తెలిపారు. అయితే, రాజకీయ లబ్ది కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్, గోరెటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# కెటిఆర్‌పై రాజకీయ కక్షసాధింపు

మొదటి పేజీ తరువాయి

వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతొ కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిండు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.. మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదు అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సమాజంలో ప్రజల అంశాలపై ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధం అని మండిపడ్డారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్ అని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి అని వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

మొదటి పేజీ తరువాయి

పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రి కోరారు. అవసర మైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపి ణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడిం చారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై అక్రమ కేసులు రేవంత్ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం.స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

# లొంగిపోతే ప్రభుత్వ పక్షాన సాయం

మొదటి పేజీ తరువాయి

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, టెక్ శంకర్‌తో పాటు దళాలకు చెందిన 13 మంది హతమయ్యారని, 50 మందిని అరెస్టు చేశామని వివరించారు.ఇప్పటికైన మావోయిస్టుల్లో మిగిలిన వారు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలువాలని సూచించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతూనే ఉంటుందని వెల్లడించారు. మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయాలనే లక్ష్యంతో, శాంతి భద్రతలు కాపాడేందుకు ఏపీ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్ షాక్

మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

# తిరుమల చేరుకున్నరాష్ట్రపతి ముర్ము

మొదటి పేజీ తరువాయి

సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, భానుప్రకాశ్‌రెడ్డి, తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి.. రాష్ట్రపతికి స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. అంతకు ముందు రేణిగుంట విమానాశ్రయం నుంచి ద్రౌపది ముర్ము తిరుచానూరు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

# బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం

మొదటి పేజీ తరువాయి

సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడీయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

మొదటి పేజీ తరువాయి

సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే..శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము పాల్గొనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన

మొదటి పేజీ తరువాయి

జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది. టీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనైన (అమీర్ రషీద్ అలీ)ని, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వాని లను ఔఎం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ ఇంటరాగేట్ చేస్తోం ది. కాగా, ఈ పేలుడు ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్ఐఏకి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఏజెన్సీ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది. నవంబర్ 10న ఢిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్‌లో ముష్కరమూకలు జరిపిన పేలుడులో 15 మంది మరణించారు.



## ఏడుపాయల వనదుర్గా అమ్మవారికి విశేష దీపాలంకారం

### - కార్తీక మాసం చివరి రోజు భక్తుల రద్దీ

మెదక్.నవంబర్ 20(ఆకాంక్ష) : కార్తీక మాసం ముగింపు సందర్భంగా మెదక్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గా అమ్మవారి ఆలయంలో ఘనమైన విశేషాలంకారం నిర్వహించారు. పరమేశ్వరి రూపంలో అమ్మవారిని తీర్చిదిద్దిన వేదపండితులు వేదఘోషలతో, మంగళవాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రద్ధాభక్తులతో నిండిన దేవాలయ ప్రాంగణం వేలాది దీపాల కాంతులతో అపూర్వంగా కళకళలాడింది.పూర్వాహ్నం నుంచే భక్తుల రద్దీ భారీగా కనిపించింది. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలతో పాటు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు. 'అమ్మ దర్శనం, దీపాలంకరణ' కోసం రాత్రివేళల్లో కూడా భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు.ఆలయ అధికారులు, సేవకులు భక్తుల సౌకర్యార్థం విస్తృత చర్యలు చేపట్టారు. శ్రద్ధ కనబరిచి భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టడంతో ఆలయం ఉత్సవ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్తీక మాసం ముగింపు రోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం మహాఫలదాయకమని పురోహితులు తెలిపారు. దీపాలంకరణతో దేవాలయం మొత్తం వెలుగుల హారంగా మారి భక్తుల హృదయాలకు ప్రశాంతి, భక్తి భావాలను అందించిందని భక్తులు తెలిపారు. "ఇంత అందమైన అలంకారం ఏళ్ల తర్వాత చూసాం మా కోరికలు అన్నీ తీర్చే అమ్మ" అని భక్తులు పేర్కొన్నారు.కార్తీక మాసం అవసానాన్ని పురస్కరించుకొని జరిగిన ఈ వేడుకలు జిల్లా విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి.

## ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు

### - ట్రాఫిక్ ఎస్ఐ సహదేవ్ సింగ్



పెద్దపల్లిటౌన్.నవంబర్ 20(ఆకాంక్ష) : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి ట్రాఫిక్ ఎస్ఐ సహదేవ్ సింగ్ అన్నారు. గురువారం రోజున పెద్దపల్లి మండలం లోని పెద్దకల్వల వద్ద ద్విచక్ర వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీ లో బాగంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా విధించి నంబర్ ప్లేట్ లు అందించి, అలాగే పెద్దబొంకూర్ నుండి రాంగు రూట్ లో వస్తున్న వాహనాలనుపట్టుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల పత్రాలను విధిగా ఉంచుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలనునడపాలని, మద్యంతాగివాహనాలు నడపరాదని అన్నారు.

## ఖమ్మంపెల్లి అక్రమ ఇసుక రవాణా

## తరలిస్తున్న ట్రాక్టర్ పై కేసు నమోదు



మంథని రూరల్ నవంబర్ 20(ఆకాంక్ష) : మంథని మండలంలోని మానేరు నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు గురువారం ఉదయం పోలీసులు ఖమ్మంపల్లి పరిసరాలో పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామానికి చెందిన పన్నాల రమేష్ యాదవ్ అనే వ్యక్తి అక్రమంగా తన ట్రాక్టర్ లో ఇసుక రావాణా చేస్తూ పట్టుబడ్డ అతన్ని వద్ద ఏమైనా అనుమతి పత్రాలు ఉన్నాయా అని అడిగితే ఏమి లేవు అని తెలపడంతో వెంటనే ట్రాక్టర్ ను అతని పోలీస్ స్టేషన్ కు తరలించారు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలుపారు మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్య తప్పవని ఎస్సై హెచ్చరించారు

## గ్రంథాలయ నూతన భవనానికి శంకుస్థాపన

### - ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లిబ్యూరో. నవంబర్ 20(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి గురువారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. జిల్లా గ్రంథాలయ వ్యవస్థను ఆధునికీకరించడానికి, పునరుద్ధరించడానికి కృషి చేస్తున్న పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్‌తో కలిసి నూతన భవనానికి పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.1 కోటి 50 లక్షల రూపాయలతో డి.ఎం.ఎఫ్.టి నిధుల ద్వారా ఈ భవనం నిర్మించబడనుంది.తదనంతరం, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్నయ్య గౌడ్, ఎమ్మెల్యే విజయరమణ రావుని శాలువాతో సన్మానించి, 'నిప్పుల వాగు' గ్రంథాన్ని బహుకరించారు. వారం రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులు, విద్యార్థినులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు గారు మాట్లాడుతూ... పుస్తకాలే ప్రియనేస్తాలు%ొ% విద్య అనేది గొప్ప ఆయుధం. గత ప్రభుత్వం గ్రంథాలయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. పెద్దపల్లి పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడ స్థిరపడుతున్న నేపథ్యంలో, వచ్చే 30%-%40 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని నూతన రూపుతో అభివృద్ధి చేస్తున్నాం అని చెప్పారు.ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి, గ్రంథాలయ నిర్మాణానికి 12 గుంటల స్థలాన్ని కేటాయించటం, డి.ఎం.ఎఫ్.టి నిధులతో రూ. 1.50 కోట్లు మంజూరు చేయించటం జరిగినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఏడాది రోజుల్లోనే భవనం నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంఈఓ సురేందర్ కుమార్, మాజీ కౌన్సిలర్లు, గ్రంథాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12 కోట్ల బియ్యం మోసందందాలో వరప్రసాద్ రావు అరెస్ట్




మంథని, నవంబర్ 20 (ఆకాంక్ష) : మంథని మండలంలో భారీ రేషన్ బియ్యం మోసం వెలుగులోకి వచ్చింది. సివిల్ సప్లై కార్పొరేషన్‌కు అప్పగించవలసిన బియ్యాన్ని ఇవ్వకుండా రూ.12 కోట్లకు పైగా మోసం చేసిన కేసులో శ్రీ లక్ష్మీ ప్రసన్న ఇండస్ట్రీస్ పార్ట్నర్ బైర్నేని వరప్రసాద్ రావును పోలీసులు అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ రాజు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు.సీఐ రాజు తెలిపిన ప్రకారం..గద్దలపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ ప్రసన్న రైస్ మిల్‌కు 2023%-%24 ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 38,489 క్వింటాళ్ల వడ్లు సివిల్ సప్లై కార్పొరేషన్ తరపున అప్పగించబడినట్టు తెలిపారు. ఈ వడ్లకు బదులుగా 25,680.43 క్వింటాళ్ల బియ్యం అందజేయాలని ఒప్పందం జరిగింది. అయితే మిల్ పార్ట్నర్స్ అయిన ఏ%-%1 బైర్నేని వరప్రసాద్ రావు, ఏ%-%2 తాటిపెల్లి శ్రీనివాస్ అక్రమ లాభాపేక్షతో అగ్రిమెంట్‌ను దుర్వినియోగం చేసి, కార్పొరేషన్‌కు బియ్యం ఇవ్వకుండా మొత్తం రూ.12 కోట్లు 37 లక్షలు 8 వేల 59 రూపాయలు మోసం చేసినట్టు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంథని పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.139/2024 కేసు నమోదు చేశారు. ఈ కేసును %బ్రాజ% సెక్షన్లు 406, 409, 420 కింద నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే నిందితుడు ఏ%-%2 తాటిపెల్లి శ్రీనివాస్‌ను గతంలోనే అరెస్ట్ చేసినట్లు సీఐ గుర్తుచేశారు. తాజా దర్యాప్తులో బైర్నేని వరప్రసాద్ రావును బుధవారం పట్టుకుని కోర్టులో హాజరుపర్చినట్టు వెల్లడించారు. మోసం కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి రావచ్చని, దర్యాప్తు కొనసాగుతోందని సీఐ రాజు స్పష్టం చేశారు.

## పెద్దపల్లిలో శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణకు చర్యలు తీసుకోవాలి

### - బీజేపీ నాయకుల వినతి



పెద్దపల్లిటౌన్. నవంబర్ 20(ఆకాంక్ష) : పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ?త్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని బీజేపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయ రమణారావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌కు కూడా వినతి సమర్పించారు.మరాఠ సింహం శివాజీ మహారాజ్ మత మతాలకతీతంగా భారతీయులను ఏకం చేసిన మహా వీరుడని, రాజ్యంతో పాటు ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన నాయకుడని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. నీతి, న్యాయం, ధర్మం, త్యాగం, శౌర్యానికి నిలువెత్తు నిదర్శనమైన శివాజీ మహారాజ్ విగ్రహం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేస్తే యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని నాయకులు అభిప్రాయపడ్డారు.శివాజీ మహారాజ్ ఆదర్శాలే నేటి తరం నడవాల్సిన మార్గమని, అలాంటి మహానాయకుడి విగ్రహం పెద్దపల్లిలో ప్రతిష్ఠించడం ద్వారా స్ఫూర్తి, దేశభక్తి మరింత బలపడుతుందని వారు తెలిపారు. విగ్రహావిష్కరణకు తగిన ఏర్పాట్లు వెంటనే ప్రారంభించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, వేల్పుల రమేష్, పెంజర్ల రాకేష్, మేకల శ్రీనివాస్, వొల్లే తిరుపతి, కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, ఎర్రోళ్ల శ్రీకాంత్, వేల్పుల రాజన్న పటేల్, ఉప్పు కిరణ్, మహంత కృష్ణ, గుడ్ల సతీష్, ముంజ రాజేంద్రప్రసాద్, పడాల శ్రీనివాస్, గడాసి సతీష్, శిలారపు మహేష్, బండి రాజశేఖర్, కుక్క అంజి, ఆనంద్ రావు, సంపత్ చారి, మొసంపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులకు కఠిన చర్యలు తప్పవు - ఎస్సై రమేష్ హెచ్చరిక




మంథని. నవంబర్ 20 (ఆకాంక్ష) : సామాజిక మాధ్యమాలను బాధ్యతగా వినియోగించాలని, ద్వేషం రెచ్చగొట్టే పోస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోవన్నట్లు మంథని ఎస్సై డి. రమేష్ కఠిన హెచ్చరిక జారీ చేశారు. ఇటీవలి కాలంలో వివిధ వర్గాల మధ్య విభేదాలు సృష్టించేలా, వ్యక్తులను కించపరిచేలా కొన్ని పోస్టులు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తున్న నేపథ్యంలో ఆయన ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా వ్యక్తి, వర్గం, మతం లేదా సంఘానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చట్ట పరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. సమాజంలోని వివిధ వర్గాల మధ్య శాంతి, భద్రత, పరస్పర గౌరవం కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్సై రమేష్ పేర్కొన్నారు.అయితే సామాజిక మాధ్యమాల్లో భావ వ్యక్తీకరణకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, అది ఇతరుల హక్కులను హరిస్తూ, విభేదాలు, ఉద్రిక్తతలు రేపే దిశగా వెళ్లకూడదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టులు సామాజిక శాంతి భద్రతలకు ముప్పు కలిగించడమే కాకుండా, చట్టపరమైన అనర్థాలకు దారితీస్తాయని ఎస్సై హెచ్చరించారు.మంథని పరిధిలో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా అపోహలు, ఆగ్రహం, భావోద్వేగాలకు లోనై సోషల్ మీడియాలో వ్యవహరించకుండా, బదులుగా శాంతి, సహనంతో ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. సమాజం సుస్థిరంగా ఉండాలంటే పరస్పర గౌరవం, సహనం తప్పనిసరి అని ఎస్సై రమేష్ అన్నారు.సామాజిక మాధ్యమాల వినియోగంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినైనా వదిలిపెట్టబోమని పోలీసులు స్పష్టం చేశారు.

## మెడికల్ బోర్డు నిలుపుదలతో పారిశ్రామిక అశాంతి : సిఐటియు

### - తుమ్మల రాజారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు




గోదావరిఖని నవంబర్ 20(ఆకాంక్ష) : గోదావరిఖనిలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం అలసత్వంతో యాజమాన్యం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడటం వలన సంస్థలో పని పారిశ్రామిక అశాంతి నెలకున్నదని ఆరోపించారు. కార్మికుల అనారోగ్య పరిస్థితిని గమనించి మెడికల్ బోర్డుకు పెట్టుకోమని చెప్పిన నేటికీ వారిని పిలవకుండా పోవడం వలన జీతం లేక కార్మికులు ఆర్థికంగా అప్పులపాలవుతున్నారని మరోవైపు రెండు సంవత్సరాల పైబడి సర్వీస్ ఉన్నప్పుడు పెట్టుకున్న వారు రిటైర్డ్ నాటికి దగ్గరికి వస్తున్న ఇప్పటికి బోర్డుకు పిలవడం లేదని మానసికంగా కృంగిపోతూ డ్యూటీలు సరిగా చేయడం లేదని ఆరోపించారు ఇలాంటి విధానాల వలన కార్మికులు డ్యూటీలు చేయకుంటే వారిని తక్కువ మస్టర్లు ఉన్నాయని కౌన్సిలింగ్కు భార్య పిల్లలతో రమ్మని నోటీసు బోర్డు వేయడం వలన మరింత మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు రెండు సంవత్సరాల ముందు పెట్టుకున్న కార్మికులు ఇంకో రెండు మూడు నాలుగు ఐదు నెలలున్న మెడికల్ కు పిలవకపోవడం ఏవిధంగా సరి అయిందని యాజమాన్యం ఇచ్చిన సర్కులర్ యాజమాన్యమే తుంగలో తొక్కితే ప్రశ్నించాల్సిన గుర్తింపు సంఘం మాట్లాడమని తూతూ మంత్రంగా చెప్పడం తప్ప అన్ని సంఘాలను కలుపుకొని పోరాటాలకు పిలుపునివ్వడం లేదని అన్నారు. కొందరు అధికారులు నాయకుల వలన పైరవీల రేటు మరింతగా పెరిగి కార్మికులు అప్పుల పాలవుతున్న యాజమాన్యం స్పందించక పోవడం సరైన విధానం కాదని ప్రభుత్వాల చేతిలో కీలు బొమ్మలుగా మారకుండా పరిశ్రమల నిబంధన కనుగుణంగా ఎలాంటి అశాంతి నెలకొనకుండా మెడికల్ బోర్డు వేదవిధిగా నిర్వహించాలని, 150 మస్టర్ల నిబంధన తొలగింపు పై ఇంకా సర్కులర్ ఇచ్చి కార్మికుల అశాంతిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మరోవైపు చలి తీవ్రత పెరిగే కార్మికులు విధులకు రావడానికి నైట్ షిఫ్ట్ లో ఇబ్బంది పడుతున్న యాజమాన్యం ఇవ్వాల్సిన గరం కోట్లను ఇవ్వడం లేదని, సిహెచ్ పి లో దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాటర్ స్ప్రింగ్ చేయించడం లేదని, ఓపెన్ కాస్ట్ బ్లాస్టింగ్ వల్ల దుమ్ముతో ఇబ్బంది పడుతున్న తీరను యాజమాన్యం నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మేదరి సారయ్య, సాంబారు వెంకటస్వామి, అర్జీవన్ బ్రాంచ్ అధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, మామిడాల శ్రీహరి, జంగపల్లి మల్లేష్, కస్తూరి చంద్రశేఖర్, పెరుకా సదానందం డిపెండెంట్లు పాల్గొన్నారు.

# బండారికుంటలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ప్రారంభం




పెద్దపల్లిటౌన్,నవంబర్ 20(ఆకాంక్ష) : సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బడి బయట పిల్లల సర్వే పెద్దపల్లి మండలంలో గురువారం ప్రారంభమైంది. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 30 వరకు మొత్తం 40 రోజుల పాటు ఈ సర్వే తీవ్రంగా సాగనుంది. పాఠశాలకు రాకుండా ఇంటి వద్దే ఉన్న 6 నుండి 14 సంవత్సరాలు, అలాగే 15 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది.మండల విద్యాధికారి టి. సురేందర్ ఈ సర్వేకు ప్రాముఖ్యత వివరిస్తూ మాట్లాడుతూ... ప్రతి పిల్లవాడూ పాఠశాలకు రావాలి. విద్యా హక్కు ప్రతి చిన్నారి కి హామీ. అందుకోసం బడి బయట తిరుగుతున్న పిల్లలను ఇంటింటికీ వెళ్లి గుర్తించి, 'ప్రభంద్ పోర్టల్' లో నమోదు చేసేందుకు సి.ఆర్.పిలు, ఐ.ఆర్.పిలు ప్రత్యేక బృందాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో పెద్దపల్లి మండలంలోని బండారికుంట గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఎంఈవో సురేందర్ స్వయంగా పాల్గొన్నారు. ఆయనతో పాటు పెద్దపల్లి క్లస్టర్ సి ఆర్ పి బాలసాని వెంకటేశం బృందాలను సమన్వయిస్తూ ఇంటి ఇంటికి సర్వే నిర్వహించారు. కుటుంబాలతో మాట్లాడి పిల్లల విద్యా స్థితిగతులు, పాఠశాలకు రాకపోవడానికి కారణాలు, తిరిగి పాఠశాలలో చేర్పు అవకాశాలు వంటి అంశాలను విపులంగా నమోదు చేశారు.విద్య కోల్పోయిన పిల్లలు ఒక్కరైనా ఉండకూడదు. పెద్దపల్లి మండలాన్ని బడి బయట పిల్లలు లేని మండలంగా మార్చడం లక్ష్యం. ప్రభుత్వం అందించే పథకాలు, బడులలో ఉన్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి వివరాలు ప్రతి కుటుంబానికి చేరుస్తాము. తల్లిదండ్రుల అవగాహన పెంచి పిల్లలను తిరిగి పాఠశాలకు చేరుస్తాం అన్నారు.సర్వే సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ఆసక్తి చూపారు. పేదరికం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు, కుటుంబ సమస్యలు వంటి కారణాల వల్ల చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించడం సులభమవుతుందని సిబ్బంది తెలిపారు. పిల్లలను మళ్లీ విద్యా ప్రవాహంలోకి తీసుకురావడం కోసం ప్రత్యేక చర్యలు ప్రారంభించనున్నట్లు అధికారులు సూచించారు.గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యాశాఖ చేపట్టిన ముఖ్యమైన ఉద్యమానికి నాంది పలికింది. వచ్చే 40 రోజులకు అన్ని మండలాల్లో సర్వే వేగవంతం కానుంది. పాఠశాలల్లో అడుగు పెట్టని ప్రతి చిన్నారి పేరు నమోదు అయ్యే వరకు ఈ ప్రచారం కొనసాగుతుందని విద్యాధికారి స్పష్టం చేశారు.

# ఆధునిక ఆక్వా సాగుతో రైతులకు ప్రయోజనకరం -గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





(ఆకాంక్ష న్యూస్)గుడివాడ నవంబర్ 20: ఆక్వా రంగంలో ఆధునిక సాగు పద్ధతుల ద్వారా రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రైతాంగ అభ్యున్నతే లక్ష్యంగా నెక్స్ట్ ఆక్వా పేరుతో క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని ఆక్వా ఎక్సేంజ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం పర్యటించారు. ఎమ్మెల్యే రాముకు సంస్థ ఫౌండర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ల్యాబ్, ఆధునిక మిషనరీలను ఎమ్మెల్యే రాము పరిశీలించారు. అత్యాధునిక ఆక్వా సాగు పద్ధతులను నెక్స్ట్ ఆక్వా పేరుతో ఎక్స్పర్ట్స్ ఎమ్మెల్యే రాముకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆక్వా నిపుణులతో సమావేశమైన ఎమ్మెల్యే రాము పలు అంశాలపై వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడారు.ఆధునిక ఆక్వా సాగు విధానాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఆధునిక పద్ధతుల్లో ఆక్వా సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే రాము అన్నారు. ఆధునిక విధానాలపై రైతులకు అవగాహన కల్పించేలా ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ డిజిటల్ ట్రేసబిలిటీ పేరుతో రైతులకు వారి గ్రామాల్లోనే క్షేత్రస్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు.నెక్స్ట్ ఆక్వా శిక్షణ కార్యక్రమాలు చీఫ్ సెక్రటరీ, స్థానిక శాసనసభ్యుడు, కలెక్టర్ నేతృత్వంలో జరుగుతాయన్నారు. ఆక్వాకు నిలయమైన నందివాడ మండలంలో మొదట విడతగా ఆరు గ్రామాల్లోనీ సన్నా, చిన్న కారు రైతులకు శిక్షణ ప్రారంభిస్తున్నామని, రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ఇతర గ్రామాల్లో కూడా శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని ఎమ్మెల్యే రాము చెప్పారు. ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకొని, ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే రాము సూచించారు.ఆక్వా ఎక్సేంజ్ సంస్థ ఫౌండర్స్ కొసరాజు పవన్ కృష్ణ, ఆక్వా నిపుణులు కిరణ్, హేమ సుందర్, కరీం, గుడివాడ జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పంద్రాజు సాంబశివరావు, చేకూరు జగన్ మోహన్ రావు, అరికెపూడి శ్రీనివాస్, యార్లగడ్డ రవి, పలువురు ఆక్వా నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సహకార వారోత్సవాల ముగింపు కార్యక్రమం





(ఆకాంక్ష న్యూస్)నవంబర్ 20(మచిలీపట్నం): కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సహకార వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. నవంబర్ 14 నుంచి ప్రారంభమైన ఈ వారోత్సవాలు సహకార సమాఖ్యల ప్రాముఖ్యత, గ్రామీణ అభివృద్ధిలో సహకార రంగం పాత్రను ప్రజలకు చేరువ చేస్తూ విజయవంతంగా కొనసాగాయి.ముగింపు కార్యక్రమంలో చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకారం అనేది గ్రామీణ భారత ఆర్థిక నిర్మాణానికి వెన్నెముక. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలు, స్వయంసహాయక బృందాల అభివృద్ధికి సహకార బ్యాంకులు కీలక భూమిక పోషిస్తున్నాయి. మచిలీపట్నం కేడీసీసీ బ్యాంక్ గతంలో సాధించిన విజయాలే కాదు, భవిష్యత్తులో కూడా అత్యధిక బాధ్యతతో ప్రజలకు సేవలు అందించడానికి కట్టుబడి ఉంది," అని పేర్కొన్నారు.అలాగే, ఆయన సిబ్బంది సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్నారంటూ అభినందిస్తూ ఈ రోజు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం మన బ్యాంక్ యొక్క సామాజిక బాధ్యతను ప్రతిబింబించే గొప్ప ఉదాహరణ. రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే మహత్తర సేవ" అని అన్నారు. అనంతరం ఆయన శిబిరాన్ని ప్రారంభించి సిబ్బందిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ ఏ. శ్యామ్ మనోహర్,డి సి ఓ చంద్రశేఖర్ రెడ్డి డిఆర్ ఫణి కుమార్ రంగబాబు జనరల్ మేనేజర్ పి.ఎల్. చంద్రశేఖర్, బ్యాంకు అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేసిన పేట ఆర్టీసీ డిపో న్ .ఎం .యు .ఏ యూనియన్ అసోసియేషన్



జగ్గయ్యపేట: నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): జగ్గయ్యపేట పట్టణ ఆర్టీసీ డిపో నుండి నడిచే ముఖ్యమైన దూరప్రాంత బస్సు సర్వీసులు ు సాయంత్రం 17.00 గంటలకు కాకినాడ, రాత్రి 21.00 గంటలకు శ్రీశైలం, ఉదయం 6.20 గంటలకు తిరుపతి, సాయంత్రం 18.00 గంటలకు తిరుపతి సూపర్ లగ్జరీ ు ఇటీవల రద్దు కావడంతో, ఈ కీలక సేవలను తిరిగి పునరుద్ధరించాల్సిన అత్యవసరతను వివరించే వినతి పత్రాన్ని .ఎం .యు .ఏ యూనియన్ ప్రతినిధులు స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి సమర్పించారు. అలాగే, స్త్రీ శక్తి పథకం అమలులో నిలిచిపోవడంతో ఇంటర్ సర్వీసులుగా నడిచే జగ్గయ్యపేట%-%కోదాడ, జగ్గయ్యపేట%-%వైరా, జగ్గయ్యపేట%-%చింతిర్యాల రూట్లలో ప్రయాణికులు మరియు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ప్రతినిధులు వివరించారు. సిబ్బందిపై జరుగుతున్న బౌతిక దాడులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందుకున్న శాసనసభ్యులు ప్రతినిధుల సమస్యలను పూర్తిగా శ్రద్ధతో విని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందనపై ఎన్ .ఎం .యు .ఏ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు గంటా భాస్కరరావు, చైర్మన్ వడ్లమూడి రాంబాబు, సెక్రటరీ శ్రీ ఐ. నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి విజేతగా ఎన్.టి.ఆర్. స్టేడియం బాడీ బిల్డర్




(ఆకాంక్ష న్యూస్)నవంబర్ 20(గుడివాడ): ఇటీవల గుంటూరు నగరం, ఎన్.టి.ఆర్. స్టేడియం నందు ఆంధ్ర ప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలు ఘనంగా జరిగినవి వఈ పోటీల లో గుడివాడ ఎన్.టి.ఆర్. స్టేడియం జిమ్ కు చెందిన బాడీ బిల్డర్ ఈజీతం ప్రశాంత్ 65 కేజీల శరీర బరువు విభాగంలో "బంగారు పతకం సాధించి "మిస్టర్ ఆంధ్ర ప్రదేశ్"గా విజయం సాధించినాడు. త్వరలో జరగబోయే జాతీయ పోటీలకు అర్హత సంపాదించాడు. ఎన్.టి.ఆర్. స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ళ వెంకటేశ్వర రావు మరియు జంపా ఉషా కుమారి శిక్షణలో ఈ క్రీడాకారుడు విజయాన్ని సాధించాడు. ఎన్.టి.ఆర్. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్, శ్రీ యలవర్తి శ్రీనివాస రావు, మరియు సంయుక్త కార్యదర్శి, కిలారపు రంగ ప్రసాద్ విజయం సాధించిన క్రీడాకారులను శిక్షణ ఇచ్చిన కోచ్‌లను అభినందించినారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రోత్సహిస్తున్న పథకాలలో పాల్గొనలేదు

(ఆకాంక్ష న్యూస్)నవంబర్ 20: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మెట్రో పాలసీ 2017 అమలుపై రాజకీయ వివాదం సృష్టించడం దురదృష్టకరం. ఈ పాలసీ ఉద్దేశం ఖరీదైన మెట్రో వంటి పెద్ద ప్రాజెక్టులు ప్రజలకు గరిష్ట ప్రయోజనం ఇవ్వాలని చూడటం. 2024 అక్టోబర్ 3న కేంద్ర ప్రభుత్వం చెన్నై మెట్రో దశ%-%2 ప్రాజెక్టుకు రూ. 63,246 కోట్లు వెచ్చించి, 119 కి.మీ మార్గానికి చరిత్రలోనే అతిపెద్ద ఆమోదం ఇచ్చింది. ఈ విషయాన్ని సీఎం స్టాలిన్ పట్టించుకోలేదు.కోయంబత్తూరు మరియు మదురై మెట్రో ప్రతిపాదనల్లో కనిపిస్తున్న ప్రధాన సమస్యలు ఇవి: కోయంబత్తూరులో మార్గదూరం తక్కువగా ఉండగా, చెన్నై కంటే ఎక్కువ ప్రయాణికుల అంచనాలు చూపించడం తార్కికంగా సరిపోవడం లేదు. సగటు ప్రయాణ దూరాలు, రోడ్డు రవాణా%-%మెట్రో వేగాల తేడా వంటి అంశాలు ప్రజలు రోడ్ల నుండి మెట్రోకి ఎక్కువగా మారుతారని సూచించవు. కోయంబత్తూరు డిపిఆర్ ప్రకారం, 7 స్టేషన్ల వద్ద తగినంత రైట్‌ఒఫ్ వే లేకపోవడం పెద్ద లోపం. మదురై సమగ్ర మొబిలిటీ ప్రణాళిక (5.2.5) ప్రకారం, ప్రస్తుత రిడర్‌షిప్ పరిస్థితే చూస్తే బిఆర్టిసి (బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్) అమలు చేయడం సముచితం. కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ (257 చ.కి.మీ) జనాభా 2011లో 15.85 లక్షలు కాగా, లోకల్ ప్లానింగ్ ఏరియా (1287 చ.కి.మీ) జనాభా 7.7 లక్షలు. కానీ రిడర్‌షిప్ అంచనాలు పెద్ద ఎల్.పి.ఏ ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని ఇవ్వడం తగిన స్పష్టీకరణను అవసరం చేస్తోంది.అలాగే.. దేశంలోని వివిధ నగరాలకు 10,000 ఎయిర్ కండీషన్డ్ ఈ-బస్సులను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం ఈ-బస్ సేవ" పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం ఉపయోగించుకోలేదు. ఈ పథకం కింద బస్సుల కొనుగోలుకు మాత్రమే కాకుండా, డిపో మౌలిక వసతుల ఏర్పాటుకు, బిహైండ్ ది మీటర్ సౌకర్యాల కోసం కూడా కేంద్ర ఆర్థిక సహాయం ఇవ్వబడుతుంది. కేంద్రం పలుమార్లు ప్రోత్సహించినప్పటికీ, ఇప్పటికీ తమిళనాడు ప్రభుత్వం ఈ పథకంలో పాల్గొనలేదు.

# మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన- ఎస్ ఐ కే వీ జీ వీ



తిరువూరు:నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్) : తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టౌన్,మండలలా సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి క్రింది అంశాలపై సూచనలు ఇచ్చిన ఎస్ ఐ కే వీ జీ వీ సత్యనారాయణ. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం గ్రామ సమాచార సేకరణ సంబంధిత ప్రాంతాల్లో షీటర్ల కదలికలపై నిఘా అవిహిత ఇసుక రవాణా గుర్తింపు మరియు సమాచారం సంఘటిత జూదాలను అరికట్టడం / సమాచారం ఇవ్వడం గ్రామాల్లో ఉన్న సి సి కెమెరాల పనితీరును తనిఖీ చేయడం తమ సచివాలయం ప్రాంతాల్లో సైబర్ నేరాలు గురించి అవగాహన కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన

## 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హెచ్చరిక





వరంగల్/రంగసాయిపేట , నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): 40వ డివిజన్‌లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా పెరిగిపోతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కార్పొరేటర్ మరుపల్ల రవి హెచ్చరించారు. గురువారం రంగసాయిపేట ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రవి మాట్లాడుతూ డివిజన్‌లో కరెంట్‌కు సంబంధించిన పనులు సక్రమంగా సాగడం లేదని, ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన ఇనుప స్తంభాలకు తుప్పు పట్టి ఎప్పుడైనా కూలిపోవచ్చని, కొన్ని సిమెంట్ స్తంభాల్లో సలాకలు బయటకు వచ్చి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, వర్షకాలంలో స్తంభాలను తాకితే షాక్ కొడుతుందని ప్రజలు భయపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. అలాగే డివిజన్‌లో తరచుగా కరెంట్ నిలిచిపోవడం, కొత్త ఇళ్ల నిర్మాణం పెరగడంతో లో వోల్టేజ్ సమస్యలు పెరిగాయని తెలిపారు. డీకే నగర్ ప్రాంతంలో ఇండ్ల మీదుగా వెళ్లే 11 కెవి, 33 కెవి లైన్లను తొలగించాల్సిన అవసరం ఉందని, అనేక ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు చాలా కిందకి వేలాడుతూ ప్రమాదాలు సృష్టిస్తున్నాయని అన్నారు.

**రవి డిమాండ్లు:** పాత ఇనుప, దెబ్బతిన్న సిమెంట్ స్తంభాలను వెంటనే మార్చాలి. లో వోల్టేజ్ సమస్యలున్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉండాలి. డీకే నగర్‌లో 11 కెవి, 33 కెవి లైన్లను తొలగించాలి. అధికారులు వెంటనే స్పందించకపోతే భారీ స్థాయిలో ఆందోళనలను ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ధర్నా సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏడీఈ పాలడుగు చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. మిల్స్ కాలనీ ఎస్సై శ్రవణ్‌కుమార్ ఆందోళనకారులను శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పూజారి విజయ్, వనం కుమార్, మరుపల్ల గౌతం, శెట్టి మోహన్, పోలేపాక రాజన్ బాబు, గజ్జి సాంబయ్య, సాదుల రంజిత్, కళ్యాణపు వెంకటేశ్వర్లు, గుల్లపల్లి కర్ణ, సమీనా బేగం, కుండె రాజు, టం టం నరసింహ, పోలేపాక మల్లేశం, చీర రమేష్, జాటోత్ వెంకన్న, గుడిమల్ల రవి, అన్న శ్రీనివాస్, కోరే సాంబమూర్తి, సాయి గౌడ్, రాము, ఆర్. రవి తదితరులు పాల్గొన్నారు.

# గట్ల నర్సింగాపూర్ కేసులో నిందితుడు గూల్ల రాజుకు 8 సంవత్సరాలు 6 నెలల కఠిన కారాగార శిక్ష




హన్మకొండ/భీమదేవరపల్లి, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): గట్ల నర్సింగాపూర్‌లో జరిగిన బెదిరింపు, దాడి కేసులో నిందితుడు గూల్ల రాజుకు హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె. పట్టాభిరామరావు 8 సంవత్సరాలు 6 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1100 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

**కేసు వివరాలు:** 2024 ఆగస్టు 17న విచారణ తేదీ సమీపిస్తున్న తరుణంలో, తనపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులో కోర్టులో సాక్ష్యం ఇవ్వొద్దని బాధితురాలు కోల సుమలతను నిందితుడు గూల్ల రాజు బెదిరించాడు. ఈ సమయంలో సుమలత కుమారుడు వెంకటేష్ అడ్డుకోవడంతో, అతనిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అప్పటి ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కేసు నమోదు చేసి, ఆత్మహత్యాయత్నం, బెదిరింపు, హత్యాయత్నం తదితర సంబంధిత సెక్షన్లతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

**న్యాయస్థాన తీర్పు:** సమగ్ర దర్యాప్తులో వచ్చిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడి దోషాన్ని రుజువు చేస్తూ శిక్ష ఖరారు చేసింది.

**పోలీసుల స్పందన:** ఈ కేసు పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్ యన్. నరేష్ (పి సి %-%3003) సేవలను ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ తీర్పుతో బాధితులకు న్యాయం జరిగిందని ముల్కనూర్ ప్రస్తుత ఎస్సై రాజు పేర్కొన్నారు.

# సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

## హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హన్మకొండ , నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల శాతం పెంపు, సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించడం ఆరోగ్య వ్యవస్థ ప్రధాన లక్ష్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె అధికారులకు సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్యతో పాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ వివరాలను గర్భధారణ 12 వారాల లోపు ఏఎన్ఎంలు తప్పనిసరిగా నమోదు చేయాలని, గర్భిణీలు కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలకు వచ్చేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అధిక సంఖ్యలో జరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రతి నెల పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం 50 ప్రసవాలు, కమలాపూర్‌లో 15 ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీల నమోదు, చెకప్‌లు తక్కువగా ఉన్న పీహెచ్సీల కారణాలు తెలుసుకుని, వాటిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అదే విధంగా, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పరకాల, కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్సీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, పోషణ లోపం ఉన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సతో పాటు తల్లిదండ్రులకు పోషకాహారం సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్‌రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, టీబీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తేదార్ అహ్మద్, మంజుల, అశోక్ రెడ్డి, పీహెచ్సీ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌రహిత సమాజమే మనందరి లక్ష్యం

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



హన్మకొండ/ హసన్‌పర్తి , నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం మనందరి ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. డ్రగ్స్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో "డ్రగ్స్‌ని తరిమేద్దాం %-% యువతను కాపాడుకుందాం" అనే నినాదంతో రూపొందించిన ప్రచార గోడపత్రికలను గురువారం కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, యువతలో మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోవడం భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను రక్షించడం, వారికి అవగాహన కల్పించడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలపై ఎవరైనా సమాచారం అందించినట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం 8712584473, 8712685299 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్.ఐ. శివకేశవులు, ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, నాగరాజు, అలాగే ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు, సందీప్ పాల్గొన్నారు.

# వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు





వరంగల్/ భద్రకాళి దేవస్థానం, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంను ప్రముఖ తెలుగు సినీ హీరో శ్రీ ఆది సాయికుమార్, అర్జున శంభాల సినిమా యూనిట్‌తో కలిసి ఈ రోజు ఉదయం సందర్శించారు.

ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం స్నపన మండపంలో శ్రీ భద్రకాళి శేషు, వేదపండితులచే మహదాశీర్వచనం నిర్వహితమైంది. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త శ్రీ తొనుపునూరి వీరన్న తదితరులు పాల్గొన్నారు. ఈ రోజు ఉదయం దేవస్థానాన్ని సందర్శించిన వికలాంగుల సేవార్థం, కీ?శే? వేముల అనసూయ గారి కుమారులు శ్రీ వేముల రాంచంద్రం, శ్రీనివాసులు, దేవస్థాన ధర్మకర్త శ్రీ కటకం రాములు సమన్వయంతో ఒక వీల్ చైర్‌ను దేవాలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీత గారి సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీ తొనుపునూరి వీరన్న, శ్రీ జారతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో సామూహిక వందేమాతరం గీతాలాపన



వరంగల్/వర్ధన్నపేట, నవంబర్ 20(ఆకాంక్ష న్యూస్): బకీమ్ చంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద భారతీయ జనతా పార్టీ వర్ధన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు %ఴ% తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్, మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, వందేమాతరం కార్యక్రమం జిల్లా కన్వీనర్ బన్న ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ భక్తిని ప్రజల్లో మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆల్ ఫోర్స్ స్కూల్, ఫుస్కోస్ స్కూల్, అరబిందో, శ్రీ చైతన్య స్కూల్‌ల విద్యార్థులు, పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, వ్యాపారస్తులు, సాధారణ పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు కొండేటి అనిత, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి సత్యం, కార్యదర్శి జెడ్. సతీష్, జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాయపురపు కుమారస్వామి, పంజా వెంకటేశ్వర్లు, మైస రాము, పెద్దురి రాజ్ కుమార్, దోమకొండ శ్రీనివాస్, నాంపల్లి యాకయ్య, తేజ నాయక్, కర్క సోమిరెడ్డి, అయిత రవికుమార్, వెల్మకంటి గిరిప్రసాద్, వినోద్, యాకుబ్, మల్లెపాక అనిల్, ఎం. పి. అనిల్, గుడ్ల సుభాష్, జూలీరి శ్యామ్, నిమ్మని సోమేశ్వరావు, విజయ్ భాస్కర్ రెడ్డి, అశోక్, బొంత రవి, సట్ల అనిల్, సాంబయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం

## - శ్రీ మహాదేవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూరెల్ల పెద్ద ఉపేందర్ గుప్తా




జనగాం, రఘునాథపల్లి, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు రామచంద్రం వారి భార్య బచ్చు లీలావతి జ్ఞాపకార్థం వారి కుమారులు, కూతుర్లు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూరెల్ల పెద్ద ఉపేందర్%–%రేణుక దంపతులు పాల్గొన్నారు. అమావాస్య సందర్భంగా ఆలయ పూజారి పిండిపోలుశ్రీనివాస్ శర్మ మహాశివునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఉపేందర్ గుప్తా మాట్లాడుతూ, "అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నదానమే అన్నిటికన్నా గొప్పది. అమావాస్య నాడు నిర్వహించే అన్నదానం మరింత పుణ్యప్రదం," అని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే దాతల సేవాభావాన్ని అభినందిస్తూ, ప్రతి నెల అమావాస్య రోజున నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చింటకింది కృష్ణమూర్తి, బచ్చు రామచంద్రం, వేణు, మురళి, లింగయ్య, బచ్చు శ్రీను, మల్కాపురం చంద్రమౌళి గౌడ్, రవీందర్ రెడ్డి, మంతెన ఉప్పలయ్య, గ్రామ ప్రముఖులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తంగడపల్లిలో 1వ & 4వ వార్డుల్లో పామెన రాములు స్వంత నిధులతో బోర్‌పంప్ ఏర్పాటు




రంగారెడ్డి జిల్లా, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల తంగడపల్లి గ్రామం 1వ మరియు 4వ వార్డుల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించే క్రమంలో గ్రామస్థుడు పామెన రాములు స్వంత నిధులతో బోర్‌పంప్ ఏర్పాటు చేశారు. గ్రామంలో కొనసాగుతున్న నీటి కొరతను గమనించిన రాములు ముందడుగు వేయడంతో గ్రామ పెద్దల సమక్షంలో బోర్‌పంప్ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పామెన రాములు మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు తోడుగా నిలబడి, గ్రామాభివృద్ధి కోసం నా వంతు సహాయం ఎల్లప్పుడూ అందిస్తాను. అవసరమైన చోట సేవ చేయడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను" అని తెలిపారు. గ్రామస్థులు స్పందిస్తూ, "మా వార్డుల్లో చాలా కాలంగా నీటి సమస్య కొనసాగుతోంది. ప్రభుత్వ పరిష్కారం ఆలస్యమవుతున్న సమయంలో రాములు స్వంత నిధులతో బోర్‌పంప్ ఏర్పాటు చేయడం మాకు ఎంతో ఉపయుక్తంగా మారింది" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, లాకెట్ రాజు, షాకీర్, లక్ష్మయ్య, రమేష్, బాలు, జంగా శ్రీకాంత్ తదితరులు పాల్గొని పామెన రాముల సేవాభావాన్ని అభినందించారు.

# పాలకుర్తి నియోజకవర్గంలో గ్రామీణ రవాణా అభివృద్ధికి కోట్లు

## - ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన



జనగామ జిల్లా/ పాలకుర్తి, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): గ్రామీణ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి కోట్లు ఖర్చు చేస్తూ అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామంలో మూడు కీలక వంతెనల నిర్మాణానికి రూ. 9 కోట్లు 32 లక్షలు మంజూరు చేయగా, ఈ వంతెనల నిర్మాణానికి ఎంపీ కడియం కావ్య గారు, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ పల్లెలకు కలువనున్న రవాణా సదుపాయాలు ఈ సందర్భంగా ప్రసంగించిన ఎంపీ కడియం కావ్య గారు మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రహదారి, వంతెన సదుపాయాలు అత్యంత కీలకం. చెర్లపాలెం పరిసర గ్రామాల ప్రజలకు రాబోయే రోజుల్లో సౌకర్యవంతమైన రవాణా అందించడానికి ఈ వంతెనలు ఎంతో ఉపయోగపడతాయి," అని తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ "తొర్రూరు మండలంలో ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వంతెనల అవసరాలను గుర్తించి ప్రభుత్వం స్పందించింది. ఈ వంతెనలు పూర్తి అయితే రైతులకు, విద్యార్థులకు, ఉద్యోగులకు ప్రయాణం సులభతరం అవుతుంది," అని పేర్కొన్నారు.

**స్థానిక ప్రజల్లో హర్షం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు ప్రభుత్వంపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ వంతెనలు నిర్మాణం పూర్తవుతే వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అభిప్రాయపడ్డారు. శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవంబర్ 23న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

## - 10 మంది ప్రతిభావంతులకు ఉచిత విద్య - మోషన్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్




హన్మకొండ/ నయీమ్ నగర్ , నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): మోషన్ ఐఐటీ-నీట్ జూనియర్ కాలేజీలో నవంబర్ 23న నిర్వహించనున్న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ పోస్టర్‌ను కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజస్థాన్ కోటాలోని దేశప్రసిద్ధ మోషన్ ఐఐటీ-నీట్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షకు ఈ సంవత్సరం 10వ తరగతి చదువుతున్న స్టేట్ మరియు సిబిఎస్ఈ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పరీక్ష - భారీ అవకాశాలు టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య మొత్తం ?2.50 కోట్లు విలువైన బహుమతులు వరంగల్ సెంటర్ నుండి టాప్-10 ర్యాంకర్లకు ప్రత్యేక ప్రయోజనాలు: మొదటి ర్యాంక్ విద్యార్థికి ల్యాప్టాప్ రెండవ ర్యాంక్ విద్యార్థికి టాబ్, టాప్-10 ర్యాంకర్లకు ఉచిత విద్య విద్యార్థులు ఈ విస్తృత అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని చైర్మన్ వేణుగోపాల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

**రిజిస్ట్రేషన్ వివరాలు**

ఇంట్రస్టెడ్ విద్యార్థులు టాలెంట్ టెస్ట్ రిజిస్ట్రేషన్ కోసం: 9703000850 / 851 / 852

మోషన్ ఐఐటీ-నీట్ ఇనిస్టిట్యూట్, నయీమ్ నగర్, హన్మకొండ

కార్యక్రమంలో పాల్గొన్న వారు కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, ఏజీఎం శనిగరపు సుమన్, ఏవో తాళ్లపెల్లి రమేష్, టీమ్ సభ్యులు పాక నాగరాజు, రచ్చ కుమార్, సురేందర్, తాళ్లపెల్లి వెంకట్, రావుల రవీందర్, ఒంటెరు మనోహర్, బోడ సంతోష్, జి. అనిల్, రంజిత్, సిబ్బంది లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు

# ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం



హైదరాబాద్, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్): గౌరవనీయ రాష్ట్ర డీజీపీ శ్రీ బీ. శివధర్ రెడ్డి గారి, అలాగే గౌరవనీయ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీ.సీ. సజ్జనార్ గారి ఆదేశాల మేరకు, ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, ఐపిఎస్ గారు మరియు అదనపు డీసీపీ నరసయ్య గారి పర్యవేక్షణలో చిలకలగూడ డివిజన్ సిబ్బందికి "ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం" అనే కాన్సెప్ట్‌తో రెండో రోజు శిక్షణ కార్యక్రమాలు కొనసాగించబడినాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారసిగూడ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి, లాలాగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, చిలకలగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మధు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాంపెనీ నిధుల నిర్వహణ పై ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ టి. టి. లిజేష్ గారు ఆరోగ్య పరిరక్షణ, వెల్నెస్ మార్గదర్శకాలు పై ఎన్. పురుషోత్తం గారు సిబ్బందికి అమూల్యమైన సూచనలు అందించారు. ఇట్టి శిక్షణా కార్యక్రమం ఎస్పీ కాలేజ్, పద్మారావు నగర్, చిలకలగూడలో విజయవంతంగా నిర్వహించబడింది.

# ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మత్స్య కార్మిక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



జనగామ జిల్లా / పాలకుర్తి, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి మండల కేంద్రంలో నవంబర్ 21వ తేదీ ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు మాచర్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో మత్స్య కార్మిక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిక్కుడు రాములు మాట్లాడుతూ,తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఏర్పాటు అయి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈసారి ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవాన్ని "పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా - ముదిరాజ్ ఆత్మగౌరవ ఏజెండా" నినాదంతో ప్రతీ గ్రామంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రేపు పాలకుర్తి మండల కేంద్రంలో జరగనున్న జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి ముదిరాజ్ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మామిండ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు మామిండ్ల యాకయ్య, రేగుల కృష్ణ, దేశబోయిన ప్రశాంత్, నీరటి సోమయ్య, సోమయ్య, నరేష్, యాదగిరి, సైదులు, వెంకన్న, ఎల్లయ్య గోపాల్, ప్రవీణ్, యకన్న తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రజల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి

## - బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఎల్‌ఓసీ కాపీని అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు

## - ఆపదలో అండగా నిలిచిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కొమురయ్య కుటుంబ సభ్యులు



వరంగల్/వర్ధన్నపేట, నవంబర్ 20 (ఆకాంక్ష న్యూస్) : వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన మామిండ్ల కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా, రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్‌ఓసీ) ద్వారా మంజూరైన రూ. 2,00,000 ఆర్థిక సహాయాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ఈ ఎల్‌ఓసీ మంజూరుకు ఎమ్మెల్యే నాగరాజు ప్రత్యేకంగా చొరవ చూపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్య రక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. నా వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎవరైనా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటే, నా వంతు సహాయం తప్పకుండా అందిస్తాను" అని తెలిపారు. అలాగే ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, "లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ అప్పుల బారిన పడకండి. ప్రభుత్వం అందిస్తున్న ఎల్‌ఓసీ సదుపాయం ద్వారా నిమ్స్ ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందండి" అని సూచించారు. మామిండ్ల కొమురయ్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆరోగ్యం



## నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు కరిగిపోతాయా?

ప్రస్తుతం చాలామంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. అందులో కూడా కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడేవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే కిడ్నీలో రాళ్లు ఉంటే అవి కరిగిపోవాలంటే ఎక్కువగా నీళ్లు తాగాలని డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు. అయితే ఇందులో ఎంత నిజం ఉంది? నీరు త్రాగడం వల్ల నిజంగానే మూత్రపిండాల్లో రాళ్ళు నిజంగా తొలగిపోతాయా? అయితే ఎన్ని లీటర్ల నీళ్లు తాగాలి? ఈ ప్రశ్నలకు సమాధానం ఇప్పుడు చూద్దాం.

నీరు త్రాగడం వల్ల కిడ్నీలో రాళ్ళు తొలగిపోతాయా? మూత్రపిండాల ప్రక్రియ సక్రమంగా పనిచేయడంలో నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. ఇది మలాన్ని పలుచన చేయడమే కాకుండా ఎటువంటి చికాకు లేకుండా సులభంగా బయటకు రావడానికి కూడా సహాయపడుతుంది. నీరు త్రాగడం ద్వారా ఖనిజాలు, లవణాలు మూత్రపిండాల లోపల రాళ్ల రూపంలో పేరుకుపోవు. నీటిని ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

**ఎన్ని లీటర్ల నీళ్లు తాగాలి**

ఎవరికైనా చిన్న కిడ్నీ రాయి అంటే 5 మిమీ కంటే తక్కువ రాయి కిడ్నీలో ఉంటే కొన్ని సందర్భాల్లో అది మూత్ర నాళం నుండి బయటకు వచ్చే ఛాన్స్ ఉంటుంది. ఎక్కువ నీరు త్రాగడం అంటే రోజుకు కనీసం 2.5-3 లీటర్లు లేదా 8 నుండి 12 గ్లాసుల నీళ్లు తాగితే ప్రేగు కదలికల ఫ్రీక్వెన్సీని పెంచుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు పంపడంలో సహాయపడుతుంది. అదే సమయంలో శరీరం హైడ్రేటెడ్ గా ఉంటే రాళ్ళు క్రమంగా చిన్నవి అవుతాయి. అయితే కిడ్నీలో రాయి మధ్యస్థం నుండి పెద్దది అంటే 5 మిమీ లేదా అంతకంటే పెద్దదిగా ఉంటే నీరు త్రాగటం వల్ల మాత్రమే అది కరిగిపోదు. పెద్ద రాళ్లకు..మందులు, షాక్ వేవ్ లిథోట్రిప్సీ లేదా ఆపరేషన్ అవసరం కావచ్చు. కిడ్నీలో రాళ్లు అనేది పెద్ద సమస్య కాబట్టి దీని గురించి తెలిస్తే ఆలస్యం చేయకుండా నిపుణులను సంప్రదించి తగిన చర్యలు చేపట్టడం ఉత్తమం.

## రాయలసీమ స్పెషల్ రెసిపి..

### 1000 ఏనుగుల బలం వస్తుంది,ఎలా చేసుకోవాలంటే

**రాయలసీమ అంటే ఎవరికైనా ముందుగా గుర్తుకొచ్చేది పదం పౌరుషం. రాయలసీమ వాళ్ల ఆ పౌరుషం గొడ్డుకారం నుంచే వస్తుందని చెబుతుంటారు. గొడ్డుకారం రాయలసీమ వంటకాలలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. రాయలసీమకు చెందిన ప్రజలు ఈ గొడ్డు కారం తినేందుకు బాగా ఇష్టపడతారు. అందుకే అక్కడ ప్రతి ఒక్కరి ఇంట్లో ఏది ఉన్నా లేకున్నా గొడ్డు కారం మాత్రం తప్పక ఉంటుంది. ఈ కారం అన్నంలోకి, దోసెల్లోకి, ఇడ్లీలోకి,ఇతర టిఫిన్లలోకి చాలా బాగుంటుంది. గొడ్డు కారం తినడం వల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్లు కూడా చెబుతుంటారు. అలాంటి గొడ్డుకారాన్ని రాయలసీమ స్టైల్ లో ఎలా చేసుకోవాలి,దీని తయారీకి కావాల్సిన పదార్థాలేంటో ఇక్కడ చూడండి.**

గొడ్డు కారం తయారీకి కావాల్సిన పదార్థాలు -ఎండుమిరపకాయలు-25 -ఉల్లిపాయలు- 2 -వెల్లుల్లి-12 రెబ్బలు -చింతపండు- నిమ్మపండు సైజు అంత -జీలకర్ర-1 టీస్పూన్ -ఆవాలు- 1/2 టీస్పూన్ -నూనె- 2 టేబుల్ స్పూన్లు -ఉప్ప -కరివేపాకు గొడ్డు కారం తయారీ విధానం -ముందుగా ఎండుమిర్చిని శుభ్రంగా కడిగి, వాటిని చిన్న ముక్కలుగా తుంచుకోవాలి. -ఉల్లిపాయలను కూడా చిన్నగా తరుగుకోవాలి. -వెల్లుల్లి రెబ్బలను పొట్టు తీసి వాటిని కూడా చిన్నగా తరుగుకోవాలి. -చింతపండును కొద్దిగా నీటిలో నానబెట్టాలి. -ఒక మిక్సీ జార్‌లో ఎండుమిర్చి, ఉల్లిపాయలు, వెల్లుల్లి, జీలకర్ర, ఆవాలు, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. -గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. -నానబెట్టిన





చింతపండును పిండి, దాని రసాన్ని కూడా మిశ్రమంలో కలపాలి. -స్టవ్ మీద ఒక పాన్ పెట్టి అందులో ఆయిల్ పోసి వేడి చేయాలి. -నూనె వేడెక్కిన తర్వాత కరివేపాకు వేసి వేయించాలి. -కరివేపాకు వేగిన తర్వాత గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని పాన్‌లో వేసి బాగా కలపాలి. -మిశ్రమాన్ని మీడియం మంట మీద 5-




10 నిమిషాలు వేయించాలి. -కారం వేగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి దానిని చల్లారనివ్వాలి. అంతే గొడ్డు కారం రెడీ. ఫ్రిజ్‌లో 1-2 వారాల వరకు ఈ కారాన్ని నిల్వ చేసుకోవచ్చు. -మీరు కారంను మరింత రుచిగా చేయాలనుకుంటే, కొద్దిగా బెల్లం కూడా వేసుకోవచ్చు. -చల్లారిన తర్వాత కారాన్ని ఒక గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి.

## ఈ పప్పుపై,మాంసాహారం కూడా పనికిరాదు



ఆకుకూరల్లో బచ్చలి కూర పోషకాలతో నిండి ఉన్న కూర. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. ఇందులో ఐరన్, కాల్షియం, విటమిన్స్, యాంటీ యాక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ బచ్చలికూరతో పప్పు చేసుకుంటే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. అలాగే శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా అందుతాయి. దీనిని ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

కావలసిన పదార్థాలు 1 కప్పు కందిపప్పు 2 కప్పుల సన్నగా తరిగిన బచ్చలికూర 1 ఉల్లిపాయ, సన్నగా తరిగినది 2 టమోటాలు, సన్నగా తరిగినవి 1/2 టీస్పూన్ పసుపు పొడి 1 టీస్పూన్ కారం పొడి 1/2 టీస్పూన్ ధనియాల పొడి 1/4 టీస్పూన్ జీలకర్ర పొడి రుచికి సరిపడా ఉప్పు.

2 టేబుల్ స్పూన్ల నూనె కొద్దిగా ఆవాలు కొద్దిగా జీలకర్ర 2 ఎండుమిర్చి కొద్దిగా కరివేపాకు.

తయారీ విధానం ముందుగా కందిపప్పును శుభ్రంగా కడిగి, కుక్కర్‌లో వేసి, 2 కప్పుల నీరు పోసి, 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. ఆ తరువాత ఉడికిన పప్పును మెత్తగా చేసుకోవాలి.

ఇప్పుడు ఒక గిన్నెలో నూనె వేడి చేసి, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి మరియు కరివేపాకు వేసి వేయించండి. ఆ తరువాత అందులో ఉల్లిపాయ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. అనంతరం అందులో టమాటోలు వేసి మెత్తగా అయ్యేవరకు వేయించుకోవాలి. తరువాత పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి మరియు జీలకర్ర పొడి వేసి బాగా కలపండి. అనంతరం బచ్చలికూర వేసి కొద్దిసేపు వేయించండి. అలాగే ఉడికించిన పప్పు మరియు రుచికి సరిపడా ఉప్పు వేసి కలుపుకోవాలి. ఇప్పుడు 5 నిమిషాలు ఉడికించి, వేడి వేడిగా అన్నంతో వడ్డించుకుంటే ఎంతో రుచికరమైన బచ్చలికూర పప్పు సిద్ధమైనట్లే.

## అమెరికాలో చేపల పులుసును ఇలానే చేసుకుంటారు



చేపల పులుసు అంటే ప్రతి ఒక్కరికీ ఎంతో ఇష్టం ఉంటుంది. దీనిని ఒక్కొక్కరు ఒక్కో విధంగా చేసుకుంటారు. ఇందులో దట్టించే మసాలా, ఆ చేపల ముక్కలు నోట్లోకి వెళ్ళగానే ఆహ కమ్మని రుచి కోసం అందరూ తహతహలాడుతుంటారు. మన దగ్గర ఈ చేపల పులుసును చాలా సాధారణమైన పద్ధతిలో చేసేస్తారు. కానీ అమెరికాలో ఎలా చేసుకుంటారో తెలుసా? ఈ స్టోరీలో దాని గురించి వివరించాము, పూర్తిగా చదివి అమెరికాలో చేపల పులుసును ఎలా చేసుకుంటారో తెలుసుకొని మీరూ ట్రై చేయండి.

1 %నెస్త్ర% చేప ముక్కలు (మీరు ఏ రకమైన చేపను అయినా ఉపయోగించవచ్చు, కానీ తెలుపు చేపలు బాగుంటాయి) 2 ఉల్లిపాయలు, సన్నగా తరిగినవి 2 టమోటాలు, సన్నగా తరిగినవి 1 అల్లం ముక్క, చిన్నగా తరిగినది 4 వెల్లుల్లి రెబ్బలు, చిన్నగా తరిగినవి 2 పచ్చిమిర్చి, చీలికలు 1/2 టీస్పూన్ పసుపు పొడి 1 టీస్పూన్ కారం పొడి 1 టీస్పూన్ ధనియాల పొడి 1/2 టీస్పూన్ జీలకర్ర పొడి 1/4 టీస్పూన్ మెంతుల పొడి కొద్దిగా చింతపండు పులుసు రుచికి సరిపడా ఉప్పు కొద్దిగా నూనె కొత్తిమీర, సన్నగా తరిగినది (గార్నిష్ కోసం) తయారీ విధానం చేప ముక్కలను శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పు మరియు పసుపు పొడి వేసి పక్కన పెట్టండి. ఒక గిన్నెలో నూనె వేడి చేసి, అందులోనే ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. అలాగే అందులోనే అల్లం, వెల్లుల్లి మరియు పచ్చిమిర్చి వేసి కొద్దిసేపు వేయించండి.

ఆ తరువాత ఆ మిశ్రమంలో టమాటోలు వేసుకోవాలి. అవి మెత్తగా అయ్యే వరకు వాటిని బాగా వేయించుకోవాలి. అనంతరం పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి మరియు మెంతుల పొడి వేసి బాగా కలపండి. కొద్దిసేపు ఉడికిన తరువాత అందులో చింతపండు పులుసు మరియు రుచికి సరిపడా ఉప్పు వేసి కలపండి. పులుసు బాగా మరిగి తెర్లిన తరువాత అందులో ముందుగా శుభ్రం చేసి పెట్టుకున్న చేప ముక్కలను వేసుకొని ఓ పది నిమిషాల పాటు బాగా ఉడికించుకోవాలి. అనంతరం పై నుంచి కొత్తిమీర చల్లుకుంటే ఎంత రుచికరమైన అమెరికా స్టైల్ చేపల పులుసు సిద్ధమైనట్లే.

# సినిమా న్యూస్



## అభిమానుల కోసం జపాన్ కు డార్లింగ్!




తెలుగు హీరోల అభిమానం హద్దులు ఎప్పుడో దాటి పోయింది. తెలుగు అభిమానుల్లా విదేశీ అభిమానులు కూడా టాలీవుడ్ స్టార్స్ ని ఆరాధించడం కళ్లముందు కనిపిస్తూనే ఉంది. తెలుగు హీరోలు చైనా, జపాన్, అమెరికా లాంటి దేశాలు వెళ్లినప్పుడు అక్కడ అభిమానులు ఏ స్థాయిలో అభిమానం కురిపిస్తున్నారో? చూసాం. రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, బన్నీ అంటే విదేశాల్లో పిచ్చ క్రేజ్ ఉంది. ప్రత్యేకించి జపాన్ అభిమానం ఎంతో ప్రత్యేకమైనది. మన హీరోలు ఏ దేశం వెళ్తే ఆదేశానికి జపాన్ నుంచి వచ్చేస్తున్నారంటే? అభిమానం ఏ స్థాయికి చేరిందన్నది అద్దం పడుతుంది. హీరోలు సైతం విదేశీ అభిమానులంటే అంతే ప్రాధాన్యత ఇస్తున్నారు.వాళ్లను గుర్తించి మాట్లాడటం..సెల్ఫీలు ఇవ్వడం వంటివి వాళ్లలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభాస్ ప్రత్యేకంగా అభిమానుల్ని పలకరించడం కోసమే జపాన్ వెళ్లడానికి రెడీ అవుతున్నాడు. ఆయన హీరోగా నటించిన కల్కి 2898 జపాన్ లో కూడా రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమా ప్రచారం సమయంలో డార్లింగ్ జపాన్ వెళ్లలేదు. ఇండియాలో బిజీగా ఉండటంతో ఆ సినిమా కోసం జపాన్ వెళ్లలేదు. కానీ రిలీజ్ అనంతరం ఆ సినిమాను మాత్రం జపాన్ అభిమానులు గ్రాండ్ సక్సెస్ చేసారు.ఈ నేపథ్యంలో వారికి కృతజ్ఞతలు చెప్పేందుకు డిసెంబర్ లో జపాన్ వెళ్లనున్నారు. ప్రస్తుతం పౌజీ షూటింగ్ లో డార్లింగ్ బిజీగా ఉన్నాడు. కానీ ఈ సినిమా నుంచి బ్రేక్ తీసుకుని మరీ జపాన్ వెళ్లాలనుకుంటున్నారు. కీలక షెడ్యూల్స్ ఉన్నా? వాటిని పక్కన బెట్టి జపాన్ వెళ్తున్నారని తెలిసింది. జపాన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత స్పిరిట్- సినిమా షూటింగ్ కూడా మొదలు పెట్టాలని అనుకుంటున్నారుట. పౌజీ షూటింగ్ ఉన్నా? దాంతో సంబంధం లేకుండా పట్టాలెక్కిద్దామని సందీప్ రెడ్డికి చెప్పినట్లు తెలిసింది. అలాగే రాజాసాబ్ ప్రచార కార్యక్రమాల్లో కూడా డార్లింగ్ పాల్గొంటారు.ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరిలో రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంత వరకూ ఈ సినిమాకు సంబంధించి ఒక్క ఈవెంట్ మినహా ఎలాంటి ప్రచారం చేయలేదు.

## ఫ్యాన్స్ గొడవలకు 'ఆంధ్ర కింగ్' సమాధానం చెబుతాడా?



ఈ రోజుల్లో సోషల్ మీడియా ఓపెన్ చేస్తే చాలు.. హీరోల ఫ్యాన్స్ మధ్య జరిగే యుద్ధాలే ఎక్కువగా కనిపిస్తాయి. రికార్డుల కోసం, కలెక్షన్ల కోసం బూతులు తిట్టుకోవడం ఒక కామన్ ట్రెండ్ అయిపోయింది. "అసలు ఆ హీరోకి నువ్వు ఉన్నావని కూడా తెలియదు, అయినా ఎందుకురా ఇంతలా కొట్టుకుంటారు? మీ జీవితాలు వాళ్ళేమైనా బాగుచేస్తారా?" అని చాలామంది బయటివాళ్ళు ఈతరం ఫ్యాన్స్ ను చూసి జాలిపడుతుంటారు, విమర్శిస్తుంటారు. సరిగ్గా ఇలాంటి టైమ్ లోనే ఒక సెన్సిటివ్ పాయింట్ తో వస్తోంది 'ఆంధ్ర కింగ్ తాలూకా'.అసలు ఒక అభిమాని ప్రేమకు అర్థం ఏంటి? హీరో అంటే కేవలం కటౌట్ మాత్రమేనా? కాదు, అంతకుమించి ఏదో బలమైన ఎమోషన్ ఉంది. ఈ సున్నితమైన పాయింట్ ను టచ్ చేస్తూ దర్శకుడు మహేష్ బాబు పి ఈ కథను రాసుకున్నట్లు లేటెస్ట్ ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. నేటి సోషల్ మీడియా వార్స్ లో కోల్పోతున్న ఆ "స్వచ్ఛమైన అభిమానాన్ని" గుర్తుచేసే ప్రయత్నంలా ఇది కనిపిస్తోంది. అందుకే దర్శకుడు తెలివిగా కథను ఇప్పటి కాలంలో కాకుండా, 2000 నాటి కాలంలోకి తీసుకెళ్ళాడు. అప్పట్లో సోషల్ మీడియా లేదు, ఫేక్ కలెక్షన్ల గొడవలు లేవు. కేవలం పేపర్ కటింగ్స్, థియేటర్ దగ్గర పండగ వాతావరణమే ఉండేది. ఆ నాస్టాల్జిక్ ఎమోషన్ ను బ్యాక్ డ్రాప్ గా తీసుకోవడం వల్ల, కథలో ఒక నిజాయితీ కనిపిస్తోంది. ఆనాటి ఫ్యానిజం ఎంత ప్యూర్ గా ఉండేదో చూపించడానికి ఈ సెటప్ పర్ఫెక్ట్ గా సరిపోయింది. రామ్ పోతినేని ఈ పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లున్నాడు. ముఖ్యంగా ట్రైలర్ లోని కొన్ని సన్నివేశాలు చూస్తుంటే.. హీరోని విమర్శించే వాళ్లకు గట్టి కౌంటర్ లా ఉన్నాయి. "వాడు ఉన్నాడని నాకు తెలియకపోవచ్చు, కానీ నేను ఒకడిని ఉన్నానంటే అది వాడి వల్లే" అనే తరహా హీరో ఎమోషన్ కూడా బాగా కనెక్టవుతోంది. ఇలాంటి ఈ ఎమోషన్ పండటంలో రామ్ ఎనర్జీ కీ రోల్ ప్లే చేస్తోంది. కేవలం అభిమాని ప్రేమే కాదు, ఒక హీరోకి ఉండాల్సిన బాధ్యతను కూడా ఈ సినిమా ప్రశ్నించేలా ఉంది. ఉపేంద్ర పాత్ర ద్వారా.. తనను నమ్ముకున్న అభిమాని కోసం హీరో ఏం చేశాడు? అనే కోణాన్ని కూడా చూపించబోతున్నారు. ఫ్యాన్స్ అంటే కేవలం టికెట్ కొనే కస్టమర్లు కాదు.. వాళ్ళు ఒక ఎక్స్టెండెడ్ ఫ్యామిలీ అనే మెసేజ్ ఇస్తే, అది ఇండస్ట్రీకి కూడా ఒక పాఠం అవుతుంది. మొత్తానికి సోషల్ మీడియా గొడవలతో విసిగిపోయిన ఆడియన్స్ కు, ఈ సినిమా ఒక మంచి రిలీఫ్ అయ్యేలా ఉంది. ఇప్పటివరకు రాని ఒక యునిక్ పాయింట్ ఇది. గ్లోబల్ గా ట్రెండ్ అవుతున్న ఈ 'ఫ్యాన్ ఎమోషన్' గనుక థియేటర్లో కరెక్ట్ గా కనెక్ట్ అయితే, రామ్ కెరీర్ లో 'ఆంధ్ర కింగ్' ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ గా నిలవడం ఖాయం. నవంబర్ 28న ఈ ఎమోషనల్ జర్నీ ఎలా ఉంటుందో చూడాలి.

## దేవతా సుందరి దివ్యదర్శనం ఇలా అయింది



కొన్నేళ్లుగా బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ అన్ లిమిటెడ్ గ్లామరస్ ట్రీట్ కి అభిమానులు అడిక్ట్ అయిపోయిన సంగతి తెలిసిందే. సీకే(కెల్విన్ క్లెయిన్) దేవతా సుందరిగా యువ హృదయాలలో గుడి కట్టుకుంది. సీకే బ్రాండ్ లోదుస్తులను ధరించి ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోషూట్లతో దిశా అంతర్జాలంలో గుబులు రేపుతూనే ఉంది. ఒక్క సీకే బ్రాండ్ తోనే ఈ బ్యూటీ కోట్లాది రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అదంతా అటుంచితే, దిశా పటానీ బికినీ షూట్లు, మోనోకినీ షూట్లకు అంతర్జాలంలో ఉన్న గిరాకీ గురించి విధితమే. పర్ఫెక్ట్ ఫిట్ బాడీతో ఫోటోషూట్ల క్వీన్‌గా దిశా పటానీ మైండ్ బ్లాకింగ్ ట్రీట్ నిరంతరం హీటెక్కిస్తూనే ఉంది. తాజాగా దిశా పటానీ నెవ్వర్ బిఫోర్ హాలి లుక్ లో ప్రత్యక్షమైంది. అందమైన మంచి ముత్యాలు, మిరుమిట్ల క్రిస్టల్స్ తో తీర్చిదిద్దిన అద్భుతమైన శారీ లుక్ లో పటానీ మతులు చెడగొడుతోంది. గోల్డ్ కలర్ శారీ, డిజైనర్ రివీలింగ్ బ్లౌజ్ లో దిశా దేవతా సుందరిని తలపిస్తోంది. దిశా ఈ కొత్త లుక్ లో మతులు పోగొడుతోంది. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలు సైతం కుళ్లుకునేంత అందంగా ఉందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ యువతరంలో వైరల్ గా మారుతోంది. ముత్యాలు, ఆభరణాలతో అందంగా అల్లిన మయూరంలా హృదయాలను మీటుతోందని యూత్ ఫిదా అయిపోతున్నారు. దిశా కెరీర్ మ్యాటర్‌కి వస్తే... చివరిగా ఈ బ్యూటీ %-%కల్కి 2898 ఏడి%-%లో కనిపించింది. కొన్ని ఫ్లాపు సినిమాల కారణంగా దిశా సౌండ్ సౌత్ లో అంతగా వినిపించడం లేదు. అక్షయ్ కుమార్, రవీనా టాండన్, అనిల్ కపూర్, సంజయ్ దత్, సునీల్ శెట్టిలతో కలిసి నటిస్తున్న %-%వెల్కమ్ టు ది జంగిల్%-% చిత్రీకరణ సాగుతోంది. హెూలీగార్డ్స్ సాగా - %-%ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్%-% అనే అంతర్జాతీయ చిత్రంలోను దిశా కనిపిస్తుంది. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌కి కెవిన్ స్పేసీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇది డిసెంబర్ 20న విడుదల కానుంది.

## కృతి ఇక వాటికి కూడా సై అనేస్తుందా..?



ఉప్పెనతో తెరంగేట్రం తోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరోయిన్ కృతి శెట్టి ఆ సినిమా ఇచ్చిన పుష్ తో ఏకంగా అరడజను సినిమాలు ఆగకుండా చేసింది. మొదటి సినిమా తర్వాత వచ్చిన శ్యామ్ సింగ రాయ్, బంగార్రాజు అమ్మడిని ఒడ్డున పడేసినా నెక్స్ట్ ఇక చేసిన ప్రతి సినిమా డిజాస్టర్ అయ్యింది. ఇక వరుస ఫ్లాపుల వల్ల కృతి శెట్టికి ఛాన్స్ లు కూడా కరువయ్యాయి. చివరగా శర్వానంద్ తో కృతి శెట్టి చేసిన మనమే సినిమా కూడా డిజప్పాయింట్ చేయడంతో అమ్మడు ఇక మరింత రిస్క్ లో పడింది.తెలుగులో అవకాశాలు లేవు కానీ తమిళ్ లో కృతి శెట్టికి ఛాన్స్ లు వచ్చాయి. అక్కడ రవి మోహన్ తో జినీ సినిమా చేస్తున్న కృతి శెట్టి ప్రదీప్ రంగనాథన్ తో %ూ.×.ఖ% కూడా చేసింది. ఈ రెండు సినిమాలు కూడా డిసెంబర్ లో రిలీజ్ కాబోతున్నాయి. తమిళ్ లో తన కెరీర్ బాగుండాలి అంటే కృతి శెట్టి ఈ సినిమాలతో కచ్చితంగా హిట్టు కొట్టాల్సిందే. ఐతే ఈమధ్య అమ్మడు ఫోటో షూట్స్ లో కూడా గ్లామర్ షోతో అదరగొట్టేస్తుంది.కృతి శెట్టి ఫోటో షూట్స్ ఎప్పుడూ సోషల్ మీడియాలో హంగామా చేస్తున్నాయి. ఐతే తనకు తొలి హిట్ ఇచ్చిన టాలీవుడ్ ని దూరం చేసుకోవడం ఇష్టం లేని అమ్మడు ఎలాంటి అవకాశం ఇచ్చినా నాకు ఓకే అనేస్తుందట. ప్రస్తుతం లీడ్ హీరోయిన్ ఛాన్స్ లు కష్టమని భావించిన కృతి శెట్టి స్టార్ సినిమాల్లో ఒక స్పెషల్ సాంగ్ ఛాన్స్ ఇచ్చినా చేయడానికి నేను రెడీ అంటుందట. కృతి శెట్టి స్పెషల్ సాంగ్ చేస్తే ఇప్పుడు అమ్మడు చేస్తున్న గ్లామర్ ఫోటో షూట్స్ కి పర్ఫెక్ట్ ఆప్షన్ అనేలా ఉంటుంది.కృతి వరుస ఫెయిల్యూర్స్.. కృతి శెట్టి కూడా ఇండస్ట్రీలో ఎప్పుడూ మనం అనుకున్న ఆఫర్లు రావడం కష్టం. ఒక్కోసారి అవకాశాలు వస్తున్న మార్గంలో మనం వెళ్లాల్సిందే అన్నట్టుగా ఆలోచిస్తుందట. మరి అమ్మడు నిజంగానే స్పెషల్ సాంగ్స్ కి సై అంటుందా లేదా అన్నది చూడాలి. ఉప్పెనతో తెలుగు తెరకు మరో టాలెంటెడ్ క్యూట్ లుక్స్ హీరోయిన్ వచ్చిందని అనుకున్న ఆడియన్స్ అంతా కృతి ఫెయిల్యూర్స్ చూసి అవాక్కవుతున్నారు. తెలుగులో ఒకే ఒక్క ఛాన్స్ కోసం కృతి శెట్టి చాలా ఆసక్తిగా ఎదురుచూస్తుంది. ఐతే ఆ ఛాన్స్ ఇచ్చి ఆమెను ఎవరు ఎంకరేజ్ చేస్తారన్నది చూడాలి.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com